


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

8

(జూలై 25‘76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"అసలు మీ అంత వారెవరున్నారు?.. మీకీపాటికి వంద సన్మానాలు జరగవలసింది. మీరు అడ్డం చెప్పకండి. ఇరవై రోజుల్లో గజారోహణం ఏర్పాటు చేస్తాం. సన్మాన సంచిక వెయ్యడానికి సమయం చాలదు. సన్మానం అయింతర్వాత అయితే.. ఆ ఫోటోలతో కూడా వెయ్యొచ్చు" అని పొగడటం..ఆకాశానికి ఎగర వెయ్యడం కొందరికి అలవాటు..

"అంత శక్తి నాలో ఏం ఉందండీ! నే వ్రాసింది మూడు పుస్తకాలు.. ఒకటి అచ్చు అయింది. తక్కినవి బీరువాలో దాగుడు మూతలాడుతున్నాయి.. నన్ను మీరంతగా పొగుడుతుంటే ఏదో ఇదిగా ఉంది" అని అవతల వ్యక్తి అనడం కూడా సమంజసం!

"మీ కెందుకు మీరు ఊరుకోండి అసలు సన్మానం విషయం మరిచిపోండి.. సన్మాన సంఘంవారు ఏనుగు తెచ్చి వాకిట్లో నిలబెట్టినప్పుడు - దయచేసి ఎక్కండి.. తక్కిన పనంతా మేం చూచుకొంటాం"..

"నాకు భయంగా ఉంది మీరలా అంటూంటే - పాండిత్యం గల వాళ్ళు, త్యాగమూర్తులు, దేశ సేవకులు చాలామంది ఉన్నారు దేశంలో. వారిలో ఎవరికైనా ఒకరికి తలపెట్టండి" అని సన్మానం పొందడానికి సిగుపడుతున్న పెద్దమనిషి సమాధానం చెప్పడం జరుగుతుంది.

***"మీరు ఏనుగెక్కండి మా ముక్కువ తీర్చండి"***

"మీరు నమ్రతవల్ల అలా మాట్లాడుతున్నారు గాని - నిజంగా మీకంటే ఉత్తములు ఎవరున్నారండి! మీరు వ్రాసి అచ్చువేసిన ఒక్క పుస్తకం చాలు. ఏనుగు మీద ఎన్ని ఊళ్ళయినా తిప్పవచ్చు. అది హిందీలోకి అనువదించి ఉంటే - ఎంత పేరు వచ్చేదో ! మీరు అనుమతించండి. ఆహ్వాన సంఘం రేపీపాటికి ఏర్పాటు చేస్తాం.. అసలు అయిదు రోజులు చెయ్యాలని ఉంది ఉత్సవం. మిమ్మల్ని అంత ఆయాస పెట్టడం బాగుండదని ఊరుకుంటున్నాం." అని మరింత గొప్పగా మాట్లాడుతాడు మొదట వ్యక్తి.

సన్మానం పొందడంలో గల ఆనందం గ్రహించినా ఇవతల వ్యక్తి - తహ తహలాడుతున్నట్లు కనిపించకుండా ఉండాలని - నీళ్ళు నమలడం కూడా సహజమే!

"అన్నట్టు మీ పేరున ఒక విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ప్రథమంగా ఉత్తీర్ణులైనవారికి ఏటా బంగారు పతకం ఇచ్చేందుకు కొంత విధి కూడా ఏర్పాటు చేస్తున్నాం. మనకు చాలా విశ్వవిద్యాలయాలున్నాయి గనుక - మీకిష్టమైంది కోరుకోవచ్చు" - అని అడుగుతాడు సన్మాన సంధాత!

‘అదంతా మీ ఇష్టం‘ అని ఆ రచయిత అనడంతో కొంత మెత్తపడటం కనిపిస్తుంది..

***ఏనుగుమీద మీ కుటుంబం అంతా ఎక్కాలి***

"అన్నట్టు ఇంకో చిన్న విజ్ఞప్తి. ఎలాగూ ఏనుగు వస్తుంది గనుక - మీరొక్కరే ఎక్కడం కంటే మీ కుటుంబాన్నంతటినీ ఎక్కించడం మంచిది. మీకు గల గజారోహణ దశను అందరూ పంచుకుంటారు. ఇలా ఇంతవరకు ఎక్కడా జరగలేదు కూడా"

"ఎందుకులెండి! మీ ఆవిడ సిగ్గుపడుతుంది. పైగా భయం కూడా ఎక్కువ. అసలు నేనెక్కుతానంటేనే భయపడి పోవచ్చు.. పోనీ ఏనుగును తీసివెయ్యరాదూ? " అని ఆయన ప్రాధేయపూర్వకంగా అడగడం కూడా సహజమే!

"ఏనుగు లేకపోతే హుందాతనమే ఉండదు. మీ అర్హత తగ్గించడం ఎంత మాత్రం మాకు సమ్మతం కాదు" అని రూఢీగా చెపుతాడు వచ్చిన పెద్ద మనిషి.

ఇక తప్పదనుకుంటాడా కవీశ్వరుడు. ఈ ఉత్సవం విషయం ఇంట్లో వాళ్ళకు చెపుతాడు. వాళ్ళు తాము కూడా ఏనుగెక్కాలని కుతూహలపడతారు. 'మిమ్మల్ని చేసుకున్నందువల్ల నాకిలాటి అదృష్టం పట్టింది' అని భార్య ఎంతో కొనియాడుతుంది భర్తను. పిల్లలు ఉప్పొంగిపోతారు.

కుటుంబం అంటే - కూతుళ్ళు, అల్లుళ్ళూ కూడా ఉంటారా? ఉండరా? అనే సందేహం వస్తుంది. అసలు ఏనుగు అంబారీ మీద ఎంతమంది పడతారనే సంశయం వస్తుంది. ఆహ్వాన సంఘం వారిని ముందుగా అడిగి తెలుసుకోవాలని నిశ్చయించుకుంటారు. కానీ మనస్సు ఆపుకోలేక అల్లుళ్ళకు శుభవార్త అందిస్తారు

***"ఏనుగు ఒక వేళ బెదిరితే"***

భార్యకో, పిల్లలకో అనుమానం వస్తుంది. "ఏనుగు ఒకవేళ జనాన్ని చూచి బెదిరితే ఏమవుతుంది.?" అని. పాపం ఆ కవీశ్వరుడు మాత్రం ఏం చెపుతాడు? ఎలా హామీ ఇస్తాడు. బెదిరితే ఒక్కచోటే కుప్పగా కూలిపోవడం మంచిది అని కొందరి అభిప్రాయం. ఇలా ఏనుగు అంబారీ వృత్తాంతంతో కాలం గడిచి పోతూ ఉంటుంది కవీశ్వరుని గృహంలో.

కవీశ్వరుని భార్య అడుగుతుంది "ఒక వేళ నాకు కళ్ళు తిరిగితే ఎలాగండీ! చప్పున దిగడానికి వీలుండదుగదా! పైగా ఊరేగింపులో వారంతా చూచి నవ్వుకోరుకదా ఎలా?" అని. మరి కవిపుంగవుడేం చెపుతాడు. ఆలోచిస్తానంటాడు..

మర్నాడు ఆహ్వాన సంఘం ఏర్పరుస్తానన్న పెద్ద మనిషిని కలుసుకుని "మా ఆవిడ ఇలా భయపడుతోంది. దీనికి ఏమన్నా ఉపాయం ఉందా? లేకపోతే కొంచెం పొట్టి ఏనుగును తీసుకువస్తారా?" అని అడగడం జరుగుతుంది..

దానికా పెద్ద మనిషి పకపక నవ్వి "ఇంత అట్టహాసం చేస్తూ, పొట్టి ఏనుగును తీసుకురావడమేమిటండీ అంతగా అయితే మీ భార్య కళ్ళకు గంతలు కడదాం. ఏం బాగుందా? " అంటాడు. కవీశ్వరుడేమంటాడు తలవూపి ఊరుకుంటాడు.

ఆహ్వాన సంఘానికి చెందిన వ్యక్తికి మరి కొంచెం సేపైన తర్వాత "మరి కాదూ కూడదూ అంటే డమ్మీ ఏర్పాటు చేద్దాం లెండి" అంటాడు.

"మా మరదల్ని మించిన డమ్మీలేదు.."

డమ్మీ అంటే వట్టి తెలివి తక్కువ వ్యక్తి అనే అర్థంతో కవిశ్వరుడు అన్నమాట "డమ్మీ విషయంలో మీరు ఆలోచించవలసిన పనిలేదు. ఆలోచించినా మా మరదల్నిమించిన డమ్మీని మీరు తీసుకు రాలేరు. కావాలంటే ఆవిణ్ణి పిలిపిస్తాను. అక్కకు తోడుగానూ, ఉంటుంది. దాని మక్కువా తీరుతుంది" అని సంబరపడుతూ చెబుతాడు కవిశ్వరుడు.

మొత్తానికి గజారోహణ మహోత్సవానికి సంబంధించిన సంభాషణలన్నీ జగుతాయి.. ఆరునెలలు గడుస్తాయి కూడా... ఆ ఆహ్వాన సంఘాన్ని చేకూరుస్తానన్న పెద్దమనిషిని ఎప్పుడు కలుసుకున్నా, "సంఘం ఏర్పటైపోతోందండి! ఢిల్లీలో కొందరు పెద్దలక్కూడా వ్రాశాం - సంఘంలో పేర్లు చేర్చడానికి అనుమతి ఇవ్వమని, వాటికోసం ఎదురు చూస్తున్నాం. అని కూడా ఉంటే మీ సన్మానానికి అఖిల భారత స్థాయి అందుతుంది. అందుకని ఆలస్యం చేస్తున్నాం" - అని చక్కగా నచ్చచెప్పడం, కవీశ్వరుడు సంతోషించడం జరుగుతుంది..

మరో మూడు నెలలు గడిచిపోతాయి. కానీ ఆహ్వాన సంఘం ప్రకటించబడదు. కవీశ్వరుడికీ, ఆయన కుటుంబంలో వారికి ఏనుగు ఎక్కడాన్ని గురించిన ఉబలాటం ఎక్కువవడం వల్ల కలలో ఏనుగు కనిపించడం కూడా ప్రారంభమౌతుంది..

ఒకరోజు అలాటికల కవీంద్రుల భార్యకు వచ్చి - భయంతో గజన్నర ఎత్తు మంచం మీద నుంచి దభాలున క్రింద పడటం మొఖాన బొప్పికట్టడం కూడా జరుగుతుంది..

*<u>ఏనుగు బొప్పి మిగిలిపోయింది.</u>*

కారణాంతరం వల్ల ఆ ఉత్సవం ఆగిపోవడం జరుగుతుంది.. కవీంద్రులు చాలా ఖిన్నులౌతారు. అందరి దగ్గరనుంచీ చాలా హేళన చేస్తూ జాబు వస్తుంది.. భార్య మొఖాన బొప్పిచూసినప్పుడల్లా ఏనుగు గుర్తుకు రాక తప్పదు. రాను రాను ఆ బొప్పికు ఏనుగు బొప్పి అనే పేరు కూడా వచ్చినా ఆశ్చర్యపాడాల్సిన పనిలేదు..

సన్మానం ఆగిపోయినా, ఆయన పుస్తకం "కోటిమంది బ్రహ్మచారులు" అనే గ్రంథం రెండో ముద్రణకు వస్తుంది. కుటుంబ నియంత్రణకు సంబంధించిన సూచనలతో నిండిన పుస్తకమది.

ఇదంతా ఒకరు ఫిలిం తీస్తామనీ సంభాషణలు వ్రాయమని వచ్చి చెప్పిన కథలో ఒక ఘట్టం.

కాపీ రైటు కథ చెప్పిన వారిదే, ఆషామాషీ వ్రాసేందుకు మాత్రం వారి వద్ద అనుమతి తీసుకున్నాను.

Comment on this article..